క్లుప్తంగా

ప్రజలందరికీ స్వచ్ఛమైన నీరందించాలి


మంచినీటిని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. పట్టణంలోని ఫిల్టర్‌బెడ్‌ను శనివారం పరిశీలించి మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో ఈనెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగు నీరందించాలని ఆదేశించారు. ఆమె వెంట ఏఈ అనిల్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

రాయికల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధులను నియంత్రించవచ్చని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని 1,4,5 వార్డుల్లో శానిటేషన్ పనులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పిచ్చిమొక్కలు తొలగించి నిల్వ నీటిలో బ్లీచింగ్‌పౌడర్, ఆయిల్‌బాల్స్ వేయించారు. ఆయన వెంట కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించండి

జగిత్యాలటౌన్: గీతకార్మికుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ కోరారు. గౌడ సంఘం నాయకులతో కలిసి శనివారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీ గౌడ్‌లను కలిసిన చంద్రశేఖర్‌గౌడ్ గీత కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. తాటి చెట్టు పై నుంచి పడి మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియో రూ.10 లక్షలకు పెంచాలని, గాయపడ్డ కార్మికులకు తక్షణ సాయం రూ. లక్ష వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువులు గౌడ సంఘాల నాయకులు ఉన్నారు.

వృద్ధులను విస్మరిస్తే చర్యలు


కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

జగిత్యాల: వృద్ధులను విస్మరిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కార్యాలయ ఏవో తఫజుల్ హుస్సేన్ అన్నారు. ఆర్డీవో ఆదేశాల మేరకు శనివారం పలు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. జగిత్యాల మండలం గోవిందుపల్లికి చెందిన నారాయణ, జగిత్యాలకు చెందిన సత్యనారాయణ, అలాగే మరికొంత మంది ఫిర్యాదుల మేరకు వారి కూతుళ్లు, కోడళ్లు, అల్లుళ్లను పిలిపించి కౌన్సెలింగ్‌ఇచ్చారు. వృద్ధులైన తల్లిదండ్రులను పోషించకుండా నిర్లక్ష్యం చేస్తున్న వారిపై చట్ట ప్రకారం శిక్షిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


ఇంటింటా తిరుగుతున్న వైద్యాధికారి, సిబ్బంది

మల్లాపూర్: సీజనల్ వ్యాదులు, విషజ్వరాలు ప్రబలకుండా గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని అన్నారు. మండలంలోని రాఘవపేటలో శనివారం వైద్య శిబిరం నిర్వహించి, గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేశారు. ప్రజలందరూ ఆరోగ్యసూత్రాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో రామ్మోహన్, ఎంఎల్‌హెచ్‌పీ విక్రమ్, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి


ఆత్మనగర్‌లో తల్లిపాల వారోత్సవాల్లో అధికారులు

జగిత్యాల/జగిత్యాలరూరల్/రాయికల్/పెగడపల్లి/వెల్గటూర్/ కథలాపూర్/మెట్‌పల్లిరూరల్/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/ధర్మపురి: తల్లిపాలు బిడ్డకు అమృతమని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి.అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు,సీడీపీవోలు, అంగన్‌వాడీలు,కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రెండ్‌షిప్‌డే వేడుకలు




జగిత్యాల: జిల్లా కేంద్రంలోని జ్యోతి స్కూల్‌లో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫ్రెండ్‌షిప్‌డే ఆకృతిలో కూర్చుని ప్రేమను వ్యక్తపర్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ హరిచరణ్‌రావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టుకుంటూ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్, డైరెక్టర్ మచ్చ లలిత పాల్గొన్నారు.

అటవీ జంతువుల పరిరక్షణకు సీడ్‌బాల్స్

రాయికల్: అటవీ జంతువుల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సీడ్‌బాల్స్ వేయాలని ప్రజాచైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు చింతకుంట సాయికుమార్ తెలిపారు. శనివారం రాయికల్ మండలం కట్కాపూర్‌లోని వెన్నముద్దలగండి అటవీ ప్రాంతంలో సీడ్ బాల్స్ వెదజల్లారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి,ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్, సభ్యులు పాల్గొన్నారు.

గోరింటాకు సంబరాలు

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో ఆషాఢమాసం సందర్భంగా శనివారం గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ జూపల్లి మాధవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ధర్మపురి : మండలంలోని కమలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శనివారం పూలమాల శాల్వాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు లక్ష్మణ్, వినయ్‌కుమార్, కిరణ్, సాయివర్ధన్‌లు శనివారం పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు క్రీడా దుస్తులు, కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వీరిని పీఈటీ కిశోర్, ప్రిన్సిపాల్ శ్రీధర్ అభినందించారు.

నిత్యావసర సరుకులు అందజేత

పెగడపల్లి: మండలంలోని అయితిపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆర్థికంగా నష్టపోయిన మంత్రి శ్వేతకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు శనివారం వేర్వేరుగా ఆర్థిక సాయం అందజేశారు. నిత్యావసర సరుకులతో పాటు రూ. 4 వేల నగదును కాంగ్రెస్ నాయకులు, బియ్యం, ఇతర సరుకులను బీజేపీ నాయకులు అందించి ఉదారత చాటుకున్నారు.

విద్యార్థుల జోష్



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని చైతన్య జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డేవేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఈఈ ఉద్యోగాలకు యువకుల ఎంపిక


సుచరిత్ రావు

మల్యాల: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన అయిల్నేని సుచరిత్ రావు, ముత్యంపేట గ్రామానికి చెందిన సింగిరెడ్డి వంశీధర్ రెడ్డి టీజీపీఎస్సీ ప్రకటించిన ఏఈఈ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

శెకెల్ల యువకుడు..

బుగ్గారం: మండలంలోని శెకెల్ల గ్రామానికి చెందిన వెల్గొండ లక్ష్మణ్ నీటి పారుదల శాఖలో ఏఈఈ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మణ్ ఉద్యోగం సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పంచాయతీరాజ్ ఏఈగా రాజు


రాజు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన పాతరాజు రాజు పంచాయతీరాజ్ శాఖలో ఏఈగా ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు, గ్రామస్తులు, స్నేహితులు ఆయన ను అభినందించారు.

ఎమ్మెల్యే మద్దతు కోరిన యూత్ కాంగ్రెస్ నాయకులు


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సంజీవ్

జగిత్యాలటౌన్: యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష ఎన్నికల్లో తనకు మద్దతివ్వాలని యూత్ కాంగ్రెస్ నాయకుడు క్యాస సంజీవ్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కోరారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఎన్నికల్లో తనకు మద్దతివ్వాల్సిందిగా ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు కత్రోజు గిరి, సుమన్‌రావు, ఏనుగుల రాజు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్సై

జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సుధీర్‌రావు శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కథలాపూర్ మండల ప్రత్యేకాధికారిగా మదన్‌మోహన్.

కథలాపూర్: మండల ప్రత్యేకాధికారిగా అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్నాళ్లు మండల ప్రత్యేకాధికారిగా పనిచేసిన జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు ఇతర జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్‌ను కథలాపూర్ ప్రత్యేకాధికారిగా నియమించారు.శనివారం బాధ్యతలు స్వీకరించారు.

డ్రోన్‌తో మొక్కజొన్నకు పిచికారీ

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్‌లో కొందరు అభ్యుదయ రైతులు శనివారం డ్రోన్‌తో రసాయన మందులు పిచికారి చేశారు. మొక్కజొన్న ఎత్తుగా పెరగి, కత్తెర పురుగు ఆశిస్తుండటంతో, రైతులు డ్రోన్ పిచికారీ చేయిస్తున్నారు. ప్రస్తుతం కూలీ రేటు రోజుకు రూ 800–1000 ఉన్న తరుణంలో డ్రోన్ బాగా పనిచేస్తుందని రైతులు తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి


దీక్షలో మాట్లాడుతున్న భోగ శ్రావణి

జగిత్యాలటౌన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి అన్నారు.. ఇళ్ల స్థలాలు కేటాయించాలని జగిత్యాల ఆర్డీవో కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన జర్నలిస్టుల నిరసన దీక్షకు శ్రావణి సంఘీభావం తెలిపి మాట్లాడారు. జర్నలిస్టుల సేవలను వినియోగించుకుంటున్న ఇద్దరు నాయకులు వారి సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. సీనియర్ పాత్రికేయులు టివి సూర్యం మాట్లాడుతూ జర్నలిస్టులకు రాజ్యాంగ హక్కుగా దక్కాల్సిన ఇళ్ల స్థలాల కోసం గత 30ఏళ్లుగా ఎదురుచూస్తున్నామన్నారు. వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. దీక్ష శిబిరాన్ని సందర్శించిన భారత సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు జర్నలిస్టులకు నిమ్మరసం ఇచ్చి మొదటి రోజు నిరసన దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు శ్రీరంగారావు, సిరిసిల్ల శ్రీనివాస్, కందుకూరి శశిధర్, చీటి శ్రీనివాస్‌రావు, కొత్తూరి మహేష్, బి అంజయ్య, ఎండీ జహీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌లు పంపిణీ

కోరుట్ల: పట్టణంలోని కల్లూర్ రోడ్డులో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉచిత బస్ పాస్‌లను శనివారం అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునావత్ రాజు, ఆర్టీసీ ట్రాఫిక్ గైడ్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

కోరుట్ల రూరల్: మండలంలోని గుమ్లాపూర్‌లో పారిశుధ్య పనులను ఎంపీడీవో రామకృష్ణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

కల్వర్టుకు మరమ్మతులేవీ?



మల్లాపూర్ : మండలంలోని రాఘవపేటలో స్థానిక జెడ్పీ హైస్కూల్ రోడ్డులో డ్రైనేజీపై నిర్మించిన కల్వర్టు ఇటీవల ధ్వంసమై గుంత పడింది. ఆ రోడ్డుపై రాకపోకలకు గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వెళ్లాలంటే ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతు చేయించాలి.

– బైరి రవికుమార్‌యాదవ్, రాఘవపేట

ఇసుక అక్రమ రవాణాకు 'చెక్' పోస్టులు

కోరుట్ల: కోరుట్ల మండలం నాగులపేట, పైడిమడుగు గ్రామాల సమీపంలోని వాగుల్లో నుంచి పెద్ద ఎత్తున తరలిపోతున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఇటీవల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఇసుక అక్రమ రవాణా విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్న క్రమంలో ఈ రెండు గ్రామాల్లో ఇసుక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. నాగులపేటలో రెండు చోట్ల, పైడిమడుగులో ఓ చోట చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ ఇసుక రవాణాను నియంత్రించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారులు ఏర్పాటు చేసే చెక్‌పోస్టులు సరైన చోట్లలో పక్కాగా ఉంటే ఆశించిన లక్ష్యం నెరవేరుతుందని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

చిన్ననాటి స్నేహితులకు అండగా..


మధు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు


ధర్మపురి 1981బ్యాచ్ స్నేహితులు

కథలాపూర్: స్నేహితులు ఆపదలో ఉంటే ఆర్థికంగా సాయం చేయడంతోనే తృప్తి ఉంటుందని చెప్తున్నారు ఈ యువకులు. కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ జెడ్పీ హైస్కూల్‌లో 1999–2000 విద్యా సంవత్సరం పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఇప్పటికి ప్రతీ ఏటా సమావేశాలు నిర్వహించుకుంటూ స్నేహబంధంను కొనసాగిస్తూ తమ స్నేహితుల్లో ఎవరికైనా ఆపదవస్తే అండగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

సేవా తత్పరులు ఈ.. మిత్రబృందం

ధర్మపురి: విద్యార్థి దశలో ఉన్న వారంత పెరిగి పెద్దవారై వివిధ హోదాల్లో పనులు చేస్తున్నారు. అప్పుడప్పుడు ఒక చోట కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకొంటూ వారి వారి సంతోషాలను పంచుకుంటున్నారు. అటువంటి వారిలో 1981 ఎస్ఎస్‌సి మిత్రబృందం ఒకటని చెప్పవచ్చు. 2003లో ఏర్పడిన ఈ మిత్రబృందం వివిధ హోదాల్లో స్థిరపడ్డారు. తమ మిత్రబృందంలో ఆర్థికంగా లేనటువంటి మిత్రులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. స్నేహితులకు సహాయ సహకారాలతో పాటు సామాజిక సేవాకార్యక్రమాల్లో ఈ మిత్రబృందం నేటికి చురుగ్గా పాలు పంచుకుంటున్నారు.

ఆపద వస్తే అండగా..

కోరుట్ల రూరల్: కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ఒకే పాఠశాలలో చదువుకున్న రామకృష్ణా, సాయి, విజయ్, ప్రసాద్, బండి మధూ, ఇలా సుమారు ఇరవై మంది బాల్య స్నేహితులు డైనమిక్ బాయ్స్ యూత్ అసోసియేషన్ ను ఏర్పాటు చేసుకుని, వీరిలో ఎవరికి కష్టమొచ్చినా అందరూ షేర్ చేసుకుంటారు. అంతే కాకుండా ఎవరైనా నిరుపేదలకు ఆర్థిక సహాయం అందించాలన్నా తలా ఇంతా జమ చేసి ఆకుటుంబానికి అండగా నిలుస్తున్నారు.

స్నేహితుని కుటుంబానికి బాసట

సారంగాపూర్: తమతో చదివిన స్నేహితుని కుటుంబాలు కష్టాల్లో ఉంటే ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి చిన్ననాటి మిత్రులు బాసటగా నిలుస్తున్నారు. సారంగాపూర్ మండలం పెంబట్ల కోనాపూర్ ఉన్నత పాఠశాలలో 2000–01 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తోటి మిత్రులు కష్టాల్లో ఉంటే వారి అండగా నిలుస్తున్నారు. తమ స్నేహితులు ఎవరికైనా ఆపద వస్తే ఆర్థికసాయం అందించి బాసటగా ఉంటున్నారు.

స్వచ్ఛదనం –పచ్చదనం విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

కోరుట్ల రూరల్: ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించే స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుట్ల ఆర్డీవో,మండల ప్రత్యేక అధికారి ఆనంద్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మండల అధికారులు, గ్రామాల ప్రత్యేక అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు.5 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో రామకృష్ణా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలో నిర్వహించే స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమంపై మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి శనివారం సిబ్బందికి అవగాహన కల్పించారు. రోజువారి షెడ్యూల్‌ను వివరించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్స్, ఆర్పీలు, హెల్త్ డిపార్ట్‌మెంట్, మెప్మా సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: ఈనెల 5నుంచి గ్రామాల్లో నిర్వహించే 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి మదన్ మోహన్ అన్నారు. శనివారం కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో శంకర్, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, పశువైద్యాధికారి దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ మోహన్ సూచించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం మెప్మా ఆర్పీలకు అవగాహన కల్పించారు. సమావేశంలో మేనేజర్ వెంకటలక్ష్మి, డీఈ నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.

రాయికల్: పట్టణంలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ శనివారం తెలిపారు. పట్టణ ప్రజలు, కౌన్సిలర్లు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణపై నాయకుల సంబరాలు


కోరుట్లలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మెట్‌పల్లిరూరల్: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ మెట్‌పల్లి మండలం ఆత్మకూర్, ఆత్మనగర్‌లో శనివారం మాదిగ సంఘం నాయకులు సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు.అంబేడ్కర్ విగ్రహం వద్ద మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగల కల నెరవేరింది

మల్లాపూర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పుతో మాదిగల దశాబ్దాల కల నెరవేరిందని ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకుడు మాట్ల బుచ్చయ్య అన్నారు. శనివారం మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్‌లో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంఆర్పీఎస్ నాయకులతో కలిసి ఆయన సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్, కుల సంఘాల పెద్దమనుషులు ఎర్ర మారుతి, నూతిపెల్లి దామోదర్, సింగారపు రవీందర్, కడకుంట్ల కాశీరాం, కనుక అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

కోరుట్ల రూరల్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై రాష్ట్రాలకు అధికారాలు ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ మండల మాదిగ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి, మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల మాదిగ సంఘ నాయకులు ఎర్ర శంకర్, మాజీ జెడ్పీటీసీ కొంతం రాజం, టీఎస్ ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి వనతడుపుల అంజయ్య, చెట్‌పల్లి లక్ష్మణ్,మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

మేడిపల్లి: ఎస్సీ వర్గీకరణపై శనివారం మేడిపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో తమ 30 ఏళ్ల కల నెరవేరిందని మాదిగ నాయకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మకిలీ ఇజ్రాయిల్, టాయ్స్ అధ్యక్షుడు బంగారు దీపక్, ప్రేమసాగర్, శంకర్, కాచారం మాజీ సర్పంచ్ చిట్యాల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


కథలాపూర్ మండలంలోని రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువకు గండి పడిన స్థలం ఇది. దీనికి మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346639

ఎస్సీ వర్గీకరణపై మాల ఉపకులాల ధర్నా


మేడిపల్లిలో బైఠాయించిన మాల కులస్తులు

మేడిపల్లి: సుప్రీంకోర్టు తీర్పు నిరాశ కలిగించిందని మండల మాల, ఉపకులాల నాయకులు జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పును పునారాలోచించాలని కోరారు. తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నెల్లుట్ల ప్రబాకర్, కట్లకుంట గంగాధర్, పెద్దెత్తున మాల,ఉపకలాలు పాల్గొన్నారు.